

సకాలంలో పనులు పూర్తి చేయాలి

బషీరాబాద్, ఏప్రిల్ 22: పాఠశాలలో చేపడుతున్న మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్, ప్రత్యేకాధికారి వెంకటయ్య అన్నారు. సోమవారం మంతట్టి గ్రామంలోని ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలో అమ్మ ఆదర్శ కమిటీలు చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలో పనులు పూర్తి చర్యలు తీసుకోవాలని అక్కడున్న ఉపాధ్యాయులకు సూచించారు.



సభకు హాజరైన జనం



కోకాపేటలా ఈ ప్రాంతాన్ని మారుస్తా
- అభివృద్ధికి అండగా ఉండండి
- జిల్లాలో అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు అందజేస్తాం
- కేసీఆర్‌తో పోరాడేంత బలం ఇచ్చింది మల్కాజ్‌గిరి ప్రజలే
- జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మేడ్చల్‌ను తీర్చిదిద్దుతా!

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/శామీర్‌పేట ఏప్రిల్ 22: మేడ్చల్ జిల్లాలో పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, ఐటీ హబ్‌లు ఏర్పాటు చేస్తామని, కోకాపేటలా మేడ్చల్ ప్రాంతాన్ని తీర్చిదిద్దే బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం అంతాయపల్లిలో సోమవారం సాయంత్రం నిర్వహించిన జనజాతర సభలో సీఎం మాట్లాడారు. మేడ్చల్ ప్రజలు అభివృద్ధికి అండగా ఉండాలని, ఇక్కడి ప్రజలు నన్ను ఆదుకున్నట్లుగానే కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. జిల్లాలో అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు అందజేస్తామన్నారు. జిల్లాలో స్థిర పడిన వివిధ రాష్ట్రాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జిల్లాలో దేవేందర్‌గౌడ్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంత సమస్యలపై కొట్లాడానని గత ప్రభుత్వ పెద్దల ఆటంకాలతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జిల్లా ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే ఐదేళ్లుగా తాను వెనుదిరిగి చూడలేదన్నారు. జిల్లా ప్రజలు తనను కడుపులో పెట్టుకని ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపిస్తే టీపీసీసీ అధ్యక్షుడినై నేడు ముఖ్యమంత్రిగా మీ ముందు నిలుచున్నానన్నారు. కేసీఆర్‌తో పోరాడేంత బలం ఇచ్చింది మల్కాజిగిరి ప్రజలేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ఇక్కడ అభివృద్ధి లేనందునే కోకాపేటలో ఎకరానికి రూ. 100 కోట్లు పెరిగినట్లు ఇక్కడ భూముల రేట్లు పెరుగలేదన్నారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించి కోకాపేటలా మేడ్చల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని, సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రేవంత్‌రెడ్డి కోరారు.



ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందజేస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు



అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డును ఇవ్వలేదన్నారు. ఈ ప్రాంతంలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రిగా కొనసాగిన ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగార్చారని ఆరోపించారు. కులాల, మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని మోదీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు మధుయాష్కీగౌడ్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యేలు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మైనంపల్లి హనుమంత్‌రావు, కూన శ్రీశైలంగౌడ్, నాయకులు వజ్రేష్‌యాదవ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జన జాతరకు పోటెత్తిన జనం

కలెక్టరేట్‌లో సునీతామహేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన అనంతరం అంతాయపల్లిలో ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. జనజాతరకు సీఎం రేవంత్‌రెడ్డి విచ్చేయనుండటంతో జిల్లా నాయకులు జనాలను పెద్దఎత్తున తరలించారు. పార్టీ కార్యకర్తలతో సభా ప్రాంగణం జనసందోహంగా మారింది. సభాస్థలికి ప్రముఖ నాయకులు వచ్చే వరకు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో ఊర్రూతలూగించారు.

అభివృద్ధికి పాటుపడుతా

- ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి



ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, కేంద్రంలోనూ ఇదే పార్టీ గెలుపొందినచో పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తామన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేస్తానని ఆయనే అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు. కేసీఆర్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, అక్రమ కేసులు బనాయించినా ధైర్యంగా నిలబడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు

- ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్, ఏప్రిల్ 22 : జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున హనుమాన్ జయంతి శోభాయాత్రలో డీజేలు, పెద్దపెద్ద సౌండ్స్ బాక్సులకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సోమవారం తెలిపారు. . జిల్లాలో హనుమాన్ శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ అధికారులకు సహకరించాలని, ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.శోభాయాత్రలను కమాండ్ కంట్రోల్ ద్వారా 24/7 పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే 100కి డయల్ చేయాలన్నారు. అదే విధంగా ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ప్రయాణికుడిపై వికారాబాద్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

పరిమితికి మించి వైద్య సేవలు అందించొద్దు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్



వికారాబాద్, ఏప్రిల్ 22 : జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిమితికి మించి వైద్యం చేయకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, పరిమితికి మించి వైద్యం చేయకూడదని, వారు వైద్యంఅందిస్తున్న కేంద్రంపై ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ఉండాలన్నారు. ఈ ప్రథమ చికిత్స కేంద్రంలో పడకలు ఉండకూడదని ఎలాంటి శాంపిల్ మందులు, యాంటిబయోటిక్స్ వినియోగించకూడదన్నారు. ఎంబీబీఎస్ ,అంతకంటేపై స్థాయి డిగ్రీ ఉన్న వారు మాత్రమే ఆలోపతి వైద్యం చేయాలని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, కచ్చితంగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్స్‌కు వారి సహాయకులకు సేవలు వాటి ధరల వివరాలు కనిపించేలా పెట్టాలని సూచించారు.



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలకృష్ణ

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మోమిన్‌పేట, ఏప్రిల్22: రైతులు పండించిన జొన్నలను కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ సీఈవో బాలకృష్ణ తెలిపారు సోమవారం మేకవనంపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. రైతులు పండించిన జొన్నలను కేంద్రంలో విక్రయించుకోవాలన్నారు. నాణ్యమైన జొన్నలకు ప్రభుత్వం మద్దతు . దర రూ.3180 అందించడం జరుగుతుందన్నారు. జొన్నలు విక్రయించిన రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, జహంగీర్, ఆయా గ్రామా రైతులు పాల్గొన్నారు.

రేపు కేటీఆర్ రాక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఆంధ్రజ్యోతి, మేడ్చల్ ఏప్రిల్22 : ఈనెల 24న మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలుకు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ రానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు వారు సోమవారం అలియాబాద్ చౌరస్తా వద్ద సీఎంఆర్ కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకుల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం దొంగలమ్మైసమ్మ చౌరస్తా వద్ద కేటీఆర్ కార్నర్ సమావేశం ఉంటుందని పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం

వికారాబాద్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు మద్దూరులోని గ్రీన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లి బావోజీ జాతర, శ్రీగురు లోకమసంద్‌ప్రభు ఆలయంలో జరిగే పూజా కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారు.

12క్వింటాళ్ల నకిలీ విత్తనాల పట్టివేత

- పత్తి విత్తనాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ఎస్‌వోటీ పోలీసులు



పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 22 : 12 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలను తరలిస్తుండగా సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌రహదారిపై పట్టుకున్నారు. ఆదివారం రాత్రి శామీర్‌పేట పీఎస్ పరిధి ఆరెంజ్ బోవేల్ రిసార్ట్ వద రాజీవ్ రహదారిపై వాహనాలను తనిఖీ చేపట్టారు. ఉల్లిగడ్డల లోడ్‌తో వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఈ క్రమంలో తనిఖీ చేశారు. ఉల్లిగడ్డల సంచుల మధ్య పెట్టి అక్రమంగా తరలిస్తున్న 30సంచుల బీజీ-111/హెచ్‌టీ నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్లు గడ్డం శ్రీకాంత్, నవీన్‌కుమార్‌లను అదుపులో తీసుకుని విచారించారు. సుమారు రూ. 30లక్షల విలువైన 12 క్వింటాళ్ల నకిలీ పత్తివిత విత్తనాలను కర్ణాటక రాష్ట్రం కొప్పాల్ జిల్లా కుష్టగి నుంచి మంచిర్యాల జిల్లా మందమర్రికి తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. శివయ్య, సిద్దయ్య, పిండి సురేష్ అనే వ్యక్తులు తమకు నకిలీ పత్తి విత్తనాలు మందమర్రికి చేరవేసే బాధ్యత అప్పగించినట్లు డ్రైవర్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలతో పాటు, ఉల్లిపాయల లోడ్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఓటీ, శామీఆర్‌పేట పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల జోరు!

- నాలుగో రోజు 22 నామినేషన్లు దాఖలు
- బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి దాఖలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/ రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 : చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానానికి నామినేషన్ల జోరు ఊపందుకుంది. నాలుగో రోజు ఈ రెండు స్థానాలకు 22 నామినేషన్లు దాఖలయ్యాయి. చేవెళ్ల స్థానానికి మొదటి, రెండో రోజు ముగ్గురు చొప్పు అభ్యర్థులు నామినేషన్ వేశారు. మూడో రోజు ఆరు మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నాలుగోరోజు 11 మంది అభ్యర్థులు తమ నామినేషను జిల్లా ఎన్నికల అధికారి శశాంకకు సమర్పించారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ వేయగా బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ వేశారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి నేడు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో మహేశ్వరం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వచ్చేందుకు సిద్దమయారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ప్రజాఏక్తాపార్టీ అభ్యర్థిగా ఎస్. రాజుగౌడ్, స్వతంత్ర అభ్యర్థులుగా జి మల్లేశంగౌడ్, మహ్మద్ అఫ్సర్‌క్యుదూస్, అమీర్ సాజిద్, వి పాండు, కె. శ్రీనివాస్ నామినేషన్ వేశారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థిగా మహ్మద్ సలీం, ఆలీండియా మజ్లీస్ ఈ- ఇంక్యూలబ్-ఇ-మిలాట్ ఏఐఎంఐఎం(ఐఎస్‌క్యూ) పార్టీ నుంచి మహ్మద్ అబ్దుల్, క్యూవి అబ్బాసి, ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్ నామినేషన్ దాఖలు చేశారు.



నామినేషన్ సమర్పిస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



నామినేషన్ సమర్పిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్



నామినేషన్ దాఖలు చేస్తున్న సునీతా మహేందర్‌రెడ్డి

మల్కాజ్‌గిరి స్థానానికి 11 నామినేషన్లు

మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియలో భాగంగా సోమవారం 4వ రోజు 11 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పట్నం సునీతామహేందర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ అభ్యర్థిగా అప్పారావు, స్వతంత్ర అభ్యర్థులుగా అంతోని డేవిడ్, పాలది పవన్‌కుమార్, పెండ్యాల శేషసాయి వరప్రసాద్, కంటే సాయన్న, బేగారి లోకేష్, భారత సుదర్శన్, మహమ్మద్ అక్బర్‌తో కలిపి మొత్తం 11 నామినేషన్లు వేశారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. కాగా, మల్కాజ్‌గిరి పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌లతో కలిసి సునీతామహేందర్ రెడ్డి తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అంతకుముందు బంజారాహిల్స్ హనుమాన్ ఆలయంలో పట్నం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

● వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఏప్రిల్ 22: 2023-24 యాసంగి సీజన్‌లో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలు అన్ని సిద్ధంగా ఉన్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సివిల్ సప్లయ్ కమిషనర్ సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయ్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారంలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా మొత్తం 1,19,350 అంచనా ప్రకారం మెట్రిక్ ధాన్యం వస్తుందని తెలిపారు. ఇట్టి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయడానికి ముందస్తుగానే వరి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ ఏ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.21883 చెల్లించి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22: విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మహిపతి శ్రీనివాస్‌రావుకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. నగరంలోని నిర్వహించిన ఓ కార్యక్రమంలో సోమవారం ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, ఏఐసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటర్ బుద్దా చంద్రశేఖర్, బ్రెన్‌ఈ విజన్ సీఈవో గణేష్‌నాగ్ చేతుల మీదుగా శ్రీనివాస్‌రావుకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం చేశారు. విద్యాపరిశోధన రంగంలో చేసిన విశేషకృషికి గాను జాతీయస్థాయిలో ఈ అవార్డు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, అయా విభాగాధిపతులు శ్రీనివాస్‌రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ నవ్ కంపెనీ డైరెక్టర్ భాస్కర్, చితో హెల్త్‌కేర్ సీఈవో ఎస్వీ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రావుకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం చేస్తున్న పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి



పోస్టు కార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌రెడ్డి

హామీల అమలుకు బీఆర్‌ఎస్ పోస్టుకార్డు ఉద్యమం

పరిగి, ఏప్రిల్ 22 : కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నేరవేర్చాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించే ఉద్యమాన్ని సోమవారం వికారాబాద్ జిల్లా పరిగిలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందుకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలైన రెండు లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా, వరికి రూ.500బోనస్, రైతుకూలీలకు రూ.12వేలు, వృద్ధులకు రూ.4వేల పింఛన్, మహలక్ష్మీ కింద మహిళలకు రూ.2500 తదితర హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల్లోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. లోకసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ఓట్లు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వైఎస్ చైర్మన్ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, పీరంపల్లి రాజు, టి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మాణిక్యం, సంతోష్, రవికుమార్, అనీఫ్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఓటు హక్కును వినియోగించుకోవాలి

మేడ్చల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందాల ఆధ్వర్యంలో ఓటర్లకు సోమవారం మేడ్చల్‌లో అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'నీ ఓటు-నీ భవిష్యత్తు' అని ఓటర్లకు అవగాహణ కల్పించారు. ఓటు ప్రాముఖ్యత గురించి వివరించారు. గతంలో అత్యల్ప ఓటింగ్ నమోదైన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అసెంబ్లీ పరిధిలో నిజాంపేట్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మేడ్చల్ అసెంబ్లీ పరిధిల్లో కళాజాత బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి.

సొంత నిధులతో గ్రంథాలయం ఏర్పాటు అభినందనీయం

- ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ కోదండరాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్

కొడంగల్‌రూరల్, ఏప్రిల్ 22: మారుమూల గ్రామంలో సొంత నిధులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని సంగాయిపల్లి గ్రామ పంచాయతీలో రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య తన తల్లిదండ్రులు శివమ్మ-అచ్చప్ప స్మారకార్థం రూ.30 లక్షలు సొంత నిధులతో నిర్మించిన గ్రంథాలయ భవనం, శివమ్మ విగ్రహాన్ని ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య ఉద్యోగ నిర్వాహణలో ఎంతో సేవలు అందించి, పదవీ విరమణ అనంతరం స్వగ్రామంలో ఆలయ నిర్మాణంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ తాజాగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు మాత్రమే చదువుకుంటారని, గ్రంథాలయాల్లో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో పోస్టులను భర్తీ చేయక పోవడంతో పాటు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య గ్రంథాలయ ఏర్పాటుతో పాటు విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరపడే పుస్తకాలు, రైతులకు నూతన పద్ధతుల్లో వ్యవసాయంపై సలహాలు, సూచనల కోసం పుస్తకాలను ఉంచడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజలను మేలుకొలిపే జాగృత జ్యోతులుగా, సామాజిక విజ్ఞాన కేంద్రాలుగా, సాంఘిక ఉద్యమాలకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. అలాంటి గ్రంథాలయాలు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ కటకం శివకుమార్‌గుప్త, భాస్కర్, రెడ్డి శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, సోమశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న మోదీ



తరలివస్తున్న కార్యకర్తలు

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 22 : ప్రధాని నరేంద్ర మోదీ దేశాని రక్షిస్తూ.. పేదలను ఆదుకుంటున్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కాళీమందిర్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని అక్కడ నుంచి ర్యాలీగా రాజేంద్ర నగర్ తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథకంలో తీసుకు వెళుతున్నారని, ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయన్నారు. తెలిపారు. కరోనా లాంటి వ్యాధులు వచ్చినా, యుద్ధం వచ్చినా ఎదుర్కొనే స్థితిలో దేశం ఉందన్నారు. మోదీ పాలనలోనే స్వచ్ఛభారత్ ఇంటింటికి మరుగుదొడ్డి కట్టించినట్లు చెప్పారు. దేశం ఆర్థికాభివృద్ధి సాధించినట్లు చెప్పారు. మోదీ అంటేనే నమ్మకమన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీగా ఉండి దిగజారి పోయిందన్నారు. ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావని చెప్పారు. ఎన్నికల కోసమే ఆ గ్యారంటీలను తీసుకు వచ్చారని విమర్శించారు. 2047 వరకు ఏం చేయాలన్నది బీజేపీ మేనిఫెస్టోలో మోదీ ముందే నిర్ణయించారని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్రంలో ఒక మాట, ఢిల్లీలో మరోమాట చెబుతున్నదని ఎద్దేవా చేశారు. బీజేపీ టికెట్ రావడం తన అదృష్టమని, తాను ప్రతి గ్రామంలో ప్రతి గడపకు వెళ్లినట్లు చెప్పారు. తాను టీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు కూడా వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. బీజేపీ పార్టీకి ఓటేసి తనను భారీ మెజారిటీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం కాని హామీలిచ్చింది

కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం కాని హామీలిచ్చిందని ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు అబద్ధమన్నారు. పంద్రాగస్టు వరకు రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేస్తానని సీఎం చెప్పారని, ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేదన్నారు.

బీఆర్‌ఎస్ మురిగి పోయింది: కేఎస్ రత్నం

టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే ఆ పార్టీ మురిగి పోయిందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. రాజకీయ లబ్ధి కోసం రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, స్పోక్ పర్సన్ రాణి రుద్రమదేవి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, వికారాబాద్ అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, అంజన్ కుమార్, ప్రహల్లాద్‌రావు, అందెల శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కులకచర్ల నుంచి చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులు

నామినేషన్‌కు తరలిన బీజేపీ నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 22: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కులకచర్ల నుంచి బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు ఆధ్వర్యంలో సోమవారం నామినేషన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్యాగౌడ్, సౌమ్యరెడ్డి, మహిపాల్, సురేశ్ పాల్గొన్నారు.

పరిమితి దాటొద్దు.. చిక్కుల్లో పడొద్దు



- ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ
- నామినేషన్ రోజు నుంచే ఖర్చు లెక్క
- అభ్యర్థి ఖర్చు రూ.95లక్షలకే పరిమితం
- పరిశీలించనున్న వ్యయ పరిశీలకులు

తాండూరు, ఏప్రిల్ 22: ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. నామినేషన్ల ప్రక్రియ వేగం పుంజుకుంది. దీంతో పోటీలో నిలిచే అభ్యర్థుల ఖర్చు ఇప్పటి నుంచే లెక్కించబడుతుంది. 25రోజుల పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. వ్యయ పరిశీలకుల బృందం నిఘాను పెంచుతాయి. ఎవరెంత ఖర్చు చేస్తున్నారో లెక్కగడుతూ వీడియో తీస్తారు. చేవెళ్ల పార్లమెంటు యూనిట్‌గా వ్యయ పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం నియమిస్తోంది. నియోజకవర్గాల వారీగా పరిశీలన కేంద్రాలున్నాయి. ఖర్చు విషయంలో అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎన్నికల ప్రవర్తన నియామళిని 1951లో రూపొందించారు. ఏఅభ్యర్థి ఎంత మేర ప్రచారానికి ఖర్చు చేయాలని నిర్దేశిస్తూ సెక్షన్ 19లో వివరించారు. ఎన్నికల సమయంలో ధరలకు అనుగుణంగా వాటిని వెల్లడిస్తారు. 2018 ఎన్నికల సందర్భంగా వ్యయాన్ని సవరించగా అప్పటి వ్యయమే ప్రస్తుతముంది. అసెంబ్లీ అభ్యర్థికి రూ.40లక్షలు ఉండగా పార్లమెంటు అభ్యర్థికి రూ.90లక్షలుగా నిర్ణయించారు. పోటీలో నిలబడే అభ్యర్థులు ఈసీఐ వ్యయ పరిమితి దాటి ఖర్చు చేసినా, వాటికి సంబంధించిన లెక్కలు సరైన ఆధారాలతో సమర్పించకున్నా అభ్యర్థులపై వేటు పడుతుంది.

నామినేషన్ దాఖలైనప్పటి నుంచే లెక్క

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ఖర్చును లెక్కిస్తారు. ఇందుకు కోసం అభ్యర్థి ఎదైన జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరవాలి. ఈ లావాదేవిలు ఈ ఖాతా ద్వారానే జరుగాలి. ప్రత్యేక ఆడిటర్లు వివరాలన్ని నమోదు చేస్తారు. నామినేషన్ల కంటే ముందు ఖర్చులను ప్రధాన పార్టీలుంటే ఆ పార్టీల ఖాతాలో జమ చేస్తారు.

షాడో రిజిష్టర్‌లో నమోదు

ఎన్నికుర్చీలు, టెంట్లు, సెట్లు వేశారు. ఎన్నివాహనాలు వినియోగించారు. ఎంత మందికి భోజనాలు ఏర్పాటు, ఫంక్షన్‌రేట్, వంటి వివరాలను తనిఖీ బృందాలు షాడో రిజిష్టర్‌లో నమోదు చేస్తారు. వ్యయ పరిశీలకుల ఆధ్వర్యంలో వివరాల సేకరణ ఉటుంది. స్థానికంగా ఉన్న ధరల ప్రకారం ఖర్చును లెక్కగడతారు. కల్యాణ మండపాలు, మహరాజ్, వీఐపీ కుర్చీ, వీడియోగ్రఫీ, ఎల్‌సీడీ తెరలు, చికెన్ బిర్యానీలు, శాఖాహార భోజనం, జనరేటర్, డ్రోన్ కెమెరా, పులిహోరా, సమోసా, వస్త్రం జెండాలు, ఫ్లెక్సీ బ్యానర్, మైకులు, డీజేలు, వాహన లైన్ జీపులు, ఆటోలు, లారీలు, టెంపో, మినీ బస్, డీసీఎం వ్యాన్, ట్రాక్టర్స్ వంటి వాటి ధరలను ఎన్నికల రిటర్నింగ్ ఆధ్వర్యంలో నిర్ణయిస్తారు.



మాట్లాడుతున్న షాద్‌నగర్ ఆర్డీవో

ఓటరు స్లిప్పుల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి

- షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవరావు

కేశంపేట, ఏప్రిల్ 22 : ఓటరు స్లిప్పుల పంపిణీలో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సెక్టోరల్ ఆఫీసర్లు, బీఎల్వోలకు ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండ పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కేశంపేట తహశీల్దార్ మీర్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయదికారి నిశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూతుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న తహశీల్దార్

కొందుర్గు, ఏప్రిల్ 22 : పోలింగ్ బూతుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తహశీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో లోకసభ ఎన్నికల సెక్టార్ అధికారులు, బిఎల్‌వో సూపర్‌వైజర్లు, బిఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 26 పోలింగ్ బూతులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ప్రతి బూతులో 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సీటిజన్స్ వివరాలను సేకరించాలని, వారికి ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ అంజనేయులు, సెక్టార్ అధికారులు ప్రవీణ్‌కుమార్, ఫసియా, సూజాత, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్‌ను గెలిపించండి ▸▸ ఎన్నికల ప్రచారంలో రంజిత్‌రెడ్డి

పెద్దేముల్, ఏప్రిల్ 22: బీజేపీ విద్వేషాలు రగిలించి మతాల మధ్య చిచ్చు పెడుతోందని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గొట్లపల్లి, తట్టెపల్లి గ్రామాల్లో సోమవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా గొట్లపల్లిలో వారిని పార్టీనాయకులు ఎడ్లబండ్లపై ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకెళ్లారు. అక్కడ గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రంజిత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ మాటిస్తే తప్పదని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. ఇచ్చిన ఆరుగ్యారంటీల్లో అన్నింటినీ ప్రజలకు అందిస్తుందని చెప్పారు. త్వరలోనే 15ఆగస్టుకు రైతుల రుణమాఫీకూడా జరుగుతుందని చెప్పారు. 10 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి నుంచి 200 యూనిట్లలోపు కరెంటు బిల్లులు ఎవరూ చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, రాష్ట్ర టీపీసీసెల్ కన్వీనర్ సునితాసంపత్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణీ, వైస్‌ఎంపీపీ మధులత, ఎంపీటీసీ లొంకనీలు, నాయకులు రాకేష్, లొంకనర్సిములు, నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

పరిగి: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి జి.రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి సతీమణి సీతారంజిత్‌రెడ్డి, టీఆర్‌ఆర్ సతీమణి టి.ఉమారెడ్డిలు కోరారు. పరిగి మునిసిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సోమవారం వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాలమూరు, చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టులు కట్టకుండా ఉమ్మడి జిల్లాకు తరని అన్యాయం చేసిన కేసీఆర్ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి పరిగి నుంచి రూ.50వేల మెజారిటీని ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ, కడ్మూరీ ఆనందం, మాజీ ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌గుప్త, జిల్లా కార్యదర్శి కె.హన్మంత్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మండల అధ్యక్షుడు బి.పరుశురాంరెడ్డి, ఆనెం అంజనేయులు పాల్గొన్నారు.

ఎన్మెపల్లిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

పూడూరు: మండలంలోని ఎన్మెపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనందం, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



పెద్దేముల్: గొట్లపల్లిలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకులు

పరిగి: పూడూరు మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పూడూరు మండలం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, మంచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీఎస్పీ కార్యకర్తలు ఆ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

తాండూరు రూరల్: చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ మంజురానితో పాటు సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, పీపుల్స్ కళాశాల ఉపన్యాసకులు వెంకట్‌రాములు గౌడ్ తదితరులు సోమవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జర్నె నాగప్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తంచంద్, రామచంద్రారెడ్డి, మున్నూరు శేఖర్, అశోక్ పాల్గొన్నారు.

దోమ: బడేంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కవిత శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీలో చేరిన వారికి కండువాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దోమ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి, బడేంపల్లి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అందరికీ న్యాయం

షాబాద్: కాంగ్రెస్‌తోనే అందరికీ సమన్యాయం జరుగుతుందని, దేశంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొద్దామని టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ, మన్‌మర్రి, బోడంపహాడ్ గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, చేవెళ్ల ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు అనితారెడ్డి, మల్లేష్, ఎంపీటీసీ అశోక్, అశ్విని పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

చేవెళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల, ముడిమ్యాల్ ప్యాక్స్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వారు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, బండారు శైలజ, గంగి యాదయ్య, వీరేందర్‌రెడ్డి, దేవర సమతరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రమాదకర గుంతల పూడ్చివేత



పూడ్చిన గుంత

తాండూరు, ఏప్రిల్ 22: పైప్‌లైన్ లీకేజీలు, ఇష్టానుసారంగా గుంతలు తవ్వి వదిలేయడంపై ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదకరంగా గుంతలు' అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు భవానీ నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంతలను సోమవారం పూడ్చివేశారు. సాయిపూర్‌లో సూపర్ మార్కెట్ వద్ద ఉన్న లీకేజీని మరమ్మతు చేశారు. దీంతో కాలనీవాసులు, విద్యార్థుల ఇబ్బందులు తొలగిపోయాయి. మున్సిపల్ సిబ్బంది ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రాఘవులు

బషీరాబాద్, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి, మరమ్మతు పనులకు రూ.16లక్షలు మంజూరైనట్లు బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు తెలిపారు. మంతట్టి పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన అక్కడ చేపట్టబోయే పనులపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం ఎంపీడీవో మట్లాడుతూ.. కలెక్టర్ ఒక్కో పాఠశాలకు రూ.25వేల చొప్పున అత్యవసర నిధి కింద నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో మండలంలోని 61 ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాలు, విద్యార్థులకు మరుగుదొడ్ల నిర్మాణాలు, పాతవి పునరుద్ధీకరణ, తరగతిగదుల్లో విద్యుద్ధీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు అమ్మఆదర్శ కమిటీల పర్యవేక్షణలో కొనసాగుతాయన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 22: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి కోరారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఊషిగారి శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 22: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బొంరాస్‌పేట్ మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. బొంరాస్‌పేట్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వసతులు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బొంరాస్‌పేట్, రేగడిమైలారం, తుంకిమెట్ల, ఎన్కెపల్లి, మహంతీపూర్, వడిచర్ల, దుద్యాల మండలంలోని 7 పోలింగ్ కేంద్రాలతో పాటు కొడంగల్ మండలంలో 7, దౌల్తాబాద్ మండలంలో 4 పోలింగ్ కేంద్రాలను కలిపి మొత్తం 18 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. కొడంగల్ సర్కిల్ పరిధిలోని వచ్చే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అబ్దుల్ రవూఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

బంట్వారం,(కోటపల్లి)ఏప్రిల్ 22: అనారోగ్యంతో బీరోల్ మాజీ సర్పంచ్ బోయిని నర్సింహులు మృతిచెందాడు. ఆయనను అనారోగ్యం కొంతకాలంగా బాధపడుతున్నారు. వారం రోజుల కిందట చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కౌన్సిలర్ సొంత పనులకు మున్సిపల్ కార్మికులా?



కౌన్సిలర్ నిర్మిస్తున్న ఇంటి వద్ద పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 22: ప్రజలకు సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికులను ఓ కౌన్సిలర్ తన సొంత పనులకు వాడుకుంటున్నాడు. ఈ విషయంపై గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పెద్దఎత్తు చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలోని 8వ వార్డు కౌన్సిలర్ అంథోనమ్మ ఫిలిప్స్ జ్ఞానేశ్వర్‌లోని తన ఇంటిపక్కన నిర్మిస్తున్న కొత్త ఇంటి వద్ద ప్రతీరోజు మున్సిపల్ సిబ్బందితో కట్టడాలకు నీళ్ల పట్టడం, తాపీ మేస్త్రీల చేతికింద మట్టి మోయించడం వంటివి చేయిస్తున్నాడు. రాత్రీపగలు తేడా లేకుండా పనులు చేయిస్తుండటంతో ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అంథోనమ్మ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కొన్ని ఫొటోలను షేర్ చేస్తున్నారు. అయినప్పటికీ సదరు కౌన్సిలర్ వార్డులో వీధులు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులతో యథేచ్ఛగా ఇంటి పనులు చేయిస్తున్నారు. ఈ విషయం పట్ల కొందరు స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ అంథోనమ్మ ఎవరినీ లెక్కచేయడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల పనుల కోసం నియమించిన మున్సిపల్ సిబ్బందిని సొంత పనులకోసం వాడుకుంటున్న కౌన్సిలర్‌పై తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్నారు.

విచారణ జరుపుతాం

మున్సిపల్ సిబ్బందిని కౌన్సిలర్ సొంత పనుల కోసం వాడుకుంటున్న విషయం నాదృష్టికి రాలేదు. సామాజిక మాధ్యమాల్లోని ఫొటోలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

- రాములు, మున్సిపల్ కమిషనర్, మేడ్చల్

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



కొత్లాపూర్‌లో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, ఏప్రిల్ 22: మండలంలోని కొత్లాపూర్ గ్రామం ఆంజనేయస్వామి ఆలయం లో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున వేదపండితుల మంత్రోచ్చరణ లతో స్వామివారిని మేలుకొల్పారు. అనంతరం మహాకుంభం, పూర్ణహుతి, స్వామి దర్శనం, ఆశీర్వచనం, తీర్థప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకోగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, నవాంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు శంకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



వికారాబాద్: పూజ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ అనంత్ రెడ్డి దంపతులు

ఎన్నెపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపన

వికారాబాద్: ఎన్నెపల్లి శ్రీహనుమాన్ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీగణపతి, వీరభద్రుడు, శివలింగం, నందీశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులు, నాభిశిల, నవగ్రహాలు, ఊరడమ్మ, శిఖర, ధ్వజస్తంభ, త్రయాహ్నిక మహోత్సవాలను మూడు రోజుల పాటు గ్రామ పెద్దల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేయగా కౌన్సిలర్ అనంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి హోమంలో కూర్చొని పూజలు చేశారు. గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కులకచర్ల: బండవెల్కిచర్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

కులకచర్ల, , ఏప్రిల్ 22: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కులకచర్ల సొసైటీ చైర్మన్ మొగులయ్య, సీఈవో బక్కారెడ్డి అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండలంలోని ఏర్పుమళ్ల గ్రామంలో సోమవారం మహిళా సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు సంతోష, వసంత, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్:కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘం సభ్యులు

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ఘట్‌కేసర్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఘట్‌కేసర్‌లోని పలు వార్డుల్లో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పల్లుల మాధవరెడ్డి కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వాణిని పార్లమెంటులో వినిపించడానికి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆరే కనుక ఈఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బర్ల హరిశంకర్, ఖలీల్, ఫిరోజ్, షకీల్, శ్రీనివాస్‌గౌడ్, నరేష్, లక్ష్మయ్య, వెంకటేష్, సిరాజ్, నవీన్, రాజేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మట్లాడుతున్న ఎంపీడీవో

బషీరాబాద్, ఏప్రిల్ 22: ఉపాధి పనులకు కూలీల సంఖ్య మరింత పెంచాలని బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. మంతట్టి, రెడ్డిఘణాపూర్ గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడుతూ.. కొలతకు అనుగుణంగా ఉపాధి పనులు చేసి రూ.300 కూలీ వచ్చేలా చూసుకోవాలని కూలీలతో ఆయన అన్నారు. వన నర్సరీను ఎంపీడీవో పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నర్సింహరెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ ఉన్నారు.

క్రైం కార్నర్

కారు బోల్తా.. ఒకరు మృతి



నరేందర్‌రెడ్డి(ఫైల్)

పెద్దేముల్, ఏప్రిల్ 22: అదుపుతప్పి ఇన్నోవాకారు బోల్తాపడి ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దేముల్ మండలం మారెపల్లి గేటుసమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మారెపల్లి గ్రామానికి చెందిన కొమ్ము లాల్‌రెడ్డి, చౌడాపురం నరేందర్‌రెడ్డి(40)లు ఇన్నోవా కారులో ఒగులాపూర్ నుంచి మారెపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో మారెపల్లి గేటువద్దకు రాగానే మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నరేందర్‌రెడ్డి తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లాల్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు అజాగ్రత్తగా, అతివేగంగా కారునడిపిన కొమ్ములాల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్

పెద్దేముల్, ఏప్రిల్ 22: అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలంలోని కందనెల్లితండా సమీపంలో అక్రమంగా కట్టెలు కొట్టి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. కట్టెలకు సంబంధించి ఏమైనా అనుమతులు ఉన్నాయా? అని ఆరా తీయగా డ్రైవర్ లేవని చెప్పాడు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కలప తరలిస్తున్నారని డ్రైవర్ అనంతయ్య, ట్రాక్టర్ యజమాని జరుపుల భోజ్యానాయక్‌లపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

కీసర, ఏప్రిల్ 22: తిమ్మాయిపల్లి పంచాయతీ కార్యదర్శికి, ఎన్ఆర్‌జీఎస్ అధికారులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ వెంకన్న సోమవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. కొద్దిరోజుల కిందట తిమ్మాయిపల్లి నర్సరీని సందర్శించిన వెంకన్న హరితహారంలో భాగంగా నర్సరీలో పెరిగిన మొక్కలను వెంటనే నాటాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారి ఆదేశాలను బేఖాతరు చేసిన పంచాయతీ కార్యదర్శి గీతా, ఉపాధిహామీ పథకం సంబంధించిన అధికారులు నిర్లక్ష్యం వహించారు. శనివారం తిరిగి వెంకన్న తిమ్మాయిపల్లి నర్సరీని సందర్శించగా పెరిగిన మొక్కలను నాటకుండా అధికారులు మొక్కలను నాటారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ వివరణ కోరుతూ సోమవారం తిమ్మాయిపల్లి పంచాయతీ కార్యదర్శి గీతాకు, ఉపాధిహామీ పథకానికి సంబంధించిన అధికారులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వెంకన్న షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

రెండిళ్లలో చోరీ

- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22: ఇంటికి తాళం వేయకుండా పడుకున్న ఓఇంట్లో గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి బంగారు, వెండి అభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ నవదుర్గ కాలనీ ఫేస్-2లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మేర్గ రంజిత్(31) ఈనెల 20 రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనంచేసి డుప్లెక్స్‌పై ఉన్న పెంట్‌హౌజ్‌కు తాళం వేయకుండా నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి బెడ్‌రూంలోని బీరువా తెరిచి ఉండటంతో వెళ్లి చూడగా బీరువాలోని నాలుగున్న తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. పెంట్‌హౌజ్ తలుపు తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూంలోని టెబుల్ డ్రాలో నుంచి తాళంచెవితో బీరువాలోని బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. అదేవిధంగా వీరి ఇంటి పక్కనే ఉన్న విశ్వనాధం ఇంట్లోకి దొంగలు ప్రవేశించి బీరువాలో ఉన్న 10తులాల వెండి అభరణాలను అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో నివాసముంటున్న బేతి రమేష్(40) రెండేళ్లుగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం రమేష్ ఒక్కడే ఇంట్లో ఉండగా భార్య స్వాతి, కుమార్తె కుటుంబసభ్యులతో కలిసి యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని జలవిహార్ పార్క్‌కు వెళ్లారు. తిరిగి రాత్రి 8:30లకు భార్య, కుమార్తె వచ్చి చూసేసరికి రమేష్ తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. తన భర్తకు మానసిక ఆరోగ్య సమస్య కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని, అతడి మృతిపట్ల అనుమానం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని నల్లచెరువు సమీపంలో ముగ్గురు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న సమాచారం పోలీసులకు అందింది. ఈ మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్‌కు చెందిన దినేష్, ఏపీలోని నెల్లూరుకు చెందిన రాఘవేందర్‌రెడ్డి(23), ఏపీలోని పిడుగురాళ్లకు చెందిన కొత్త మణిదీప్(23)లను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాగసమందర్ పీహెచ్‌సీలో వైద్యుల కొరత



నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ధారూరు, ఏప్రిల్ 22: మండల పరిధిలోని నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత నెలకొంది. పూర్తిస్థాయి వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ధారూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఈ ఆసుపత్రికి ఇన్‌చార్జి వైద్యురాలిగా కొనసాగుతున్నారు. అయితే పూర్తిస్థాయి వైద్యుడు లేకపోవటంతో సరైన వైద్యం అందడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఇన్‌చార్జి వైద్యురాలు సక్రమంగా విధులకు హాజరుకావడంలేదంటూ ఆరోపిస్తున్నారు. కుక్కింద పల్లె దవాఖానాలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు శివశంకర్‌తో పాటు, ఏఎన్ఎంలు, సిబ్బంది రోగులకు వైద్యం అందిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. చాలా కాలంగా ఫార్మాసిస్టు పోస్టు కూడా ఖాళీగా ఉందని వారు చెప్పారు. ప్రతీరోజు పీహెచ్‌సీకి ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తుంటారని, వీరికి వైద్యం అందించేందుకు ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యుడిని నియమించాలని జిల్లా కలెక్టర్‌ను ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ఉచిత స్పోర్ట్స్ కోచింగ్

దోమ, ఏప్రిల్ 22: పరిగి మినీ స్టేడియంలో మంగళవారం (నేడు) నుంచి మే 31 వరకు నిర్వహించే వేసవి ఉచిత స్పోర్ట్స్ కోచింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి హనుమంతరావు, కోచ్ స్వాతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల్లోని, గ్రామాల్లోని క్రీడా రంగం అత్యంత ప్రతిభా వంతులను గుర్తించి, తగిన శిక్షణ ద్వారా వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ ఒలంపిక్ క్రీడల్లో రాణించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8978294432 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గురుకుల పాఠశాలలకు విద్యార్థినుల ఎంపిక

కొడంగల్, ఏప్రిల్ 22: ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన గురుకుల పాఠశాలల్లో ప్రవేశపరీక్షా ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు విష్ణువర్దన్, లక్ష్మణ్ రాథోడ్, అక్షర గురుకులాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డి.వెంకటయ్య, ప్రిన్సిపల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు అభినందించారు.

అంకితభావంతో పనిచేస్తే చిరకాల గుర్తింపు



గౌరీశంకర్ దంపతులను సత్కరిస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 22: అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయు లకు చిరకాల గుర్తింపు ఉంటుందని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం గౌరీశంకర్ పదవీ విరమణ సందర్భంగా స్థానిక శివాస్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తికి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి గౌరీశంకర్ అన్నారు. గతంలో ఆయన చేసిన కృషి ఫలితంగా అనేక మంది విద్యార్థులు 10జీపీఏలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, రిటైర్డు ఎంఈవో నర్సింహరెడ్డి, కౌన్సిలర్లు రవీందర్, హరిప్రసాద రావు, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్, అక్రంఅలీ, కేఎంరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌టీయూ టీఎస్ మేడ్చల్ మండల కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 22: ఉపాధ్యాయుల సంఘం ఎస్‌టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర నాయకులు రవికుమార్, ప్రేమ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా రాజారావు, ప్రధానకార్యదర్శిగా ఆర్ఎం.నాగేశ్వరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఏక్‌నాథ్, మోహన్‌కుమార్, శివకాంత్, రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

పరిగి, ఏప్రిల్ 22: వడగళ్లవానతో నష్టపోయిన పరిగి మండలం ఇబ్రహింపూర్‌లో వరి, మొక్కజొన్న పంటలను పరిగి డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు డీకే లక్ష్మీకుమారి సోమవారం పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఏఈవో ప్రతిభ ఉన్నారు.

చలివేంద్రంలోని కుండలు ధ్వంసం



ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 22: ప్రయాణికుల దహార్తిని తీర్చడానికి వైఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చలివేంద్రంలోని కుండలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అవుషాపూర్ మాజీ సర్పంచ్, ట్రస్టు సభ్యురాలు ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇది పిరికిపంద చర్య అన్నారు. కొందరు రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. దమ్ముంటే ప్రజాక్షేత్రంలో ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. మరోసారి ఇలాంటి చర్యలు చేపడితే తగిన బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన రాష్ట్ర ఓబీసీ కన్వీనర్



ఎంపీకి మొక్కను అందజేస్తున్న సునీతా సంపత్

తాండూరు, ఏప్రిల్ 22: తెలంగాణ ప్రదేశ్ కమిటీ ఓబీసీ కన్వీనర్‌గా నియమితులైన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతా సంపత్ సోమవారం తాండూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

యాలాల: తెలంగాణ రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ సునితా సంపత్‌ను సోమవారం యాలాల మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బస్వరాజ్, బోజిరెడ్డి, జిల్లా కోఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబ, రాఘవపూర్ శ్రీనివాస్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూధన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ విజయ యాత్ర

తాండూరు, ఏప్రిల్ 22: విశ్వహిందూ పరిషత్, స్టేషన్ హనుమాన్ భజన మండలి, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శ్రీ వీరహనుమాన్ విజయ యాత్రను మంగళవారం (నేడు) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు స్టేషన్ హనుమాన్ మందిర్ నుంచి తాండూరు పట్టణ పురవీధుల గుండా శోభయాత్రను నిర్వహించనున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.